క్లుప్తంగా

జరజాపుపేటలో రక్తదానం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న వైద్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట గ్రామంలో హిందీ ఉపాధ్యాయుడు కృష్ణ జ్ఞాపకార్థం శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా హిందీ మాస్టారు కృష్ణ చిత్రపటానికి గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఘన నివాళులు అర్పించి, ఆయన చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. గ్రామ యువత, పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. 20 మంది యువతీ, యువకులు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయరూ..

పూసపాటిరేగ : మండలంలోని పతివాడ తొత్తడాం గ్రామాల మధ్య గల మలుపు వద్ద స్పీడు బ్రేకర్లు వేయాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. నిత్యం ఆ రహదారి గుండా వందలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. తరుచూ మలుపు వద్ద ఎదెరుఎదురుగా దగ్గరకు వచ్చే వరకు వాహనాలు కనపడక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు వేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

గోకుల్ కళాశాలలో లేంప్ లైటింగ్ వేడుకలు



లేంప్ లైటింగ్ వేడుకల్లో పాల్గొన్న అతిథులు

బొబ్బిలి: మండలంలోని పిరిడి గోకుల్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థుల లేంప్ లైటింగ్ ఓత్ టేకింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొబ్బిలి ఎన్నారై ఎండీ శ్రీనివాసన్ సింగ్రి, డాక్టర్ వాణీ గాయత్రి హాజరై నర్సింగ్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. గోకుల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి మహిళా నర్స్ అయిన ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రిస్కిల్లా, గోకుల్ విద్యా సంస్థల అధినేత బొత్స వెంకట రమణ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లిలో గల భాస్కర ఫార్మసీ కాలేజ్‌లో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొణతాల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడోత్సవంలో క్రికెట్, ఖోఖో, టెన్నిస్, వాలీబాల్ ఆటల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. చైర్మన్ టీఎస్ఎస్ కార్తీక్ మాట్లాడుతూ నిత్యం క్రీడల వలన మానసిక, శారీరక ప్రశాంతత అలవడుతుందన్నారు. చైర్మన్ తూముల భాస్కరరావు మాట్లాడుతూ ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

ఆధ్యాత్మిక భావాలు వెల్లివిరియాలి



ప్రతిష్ఠ మహోత్సవాల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, శ్రీకాంత్ తదితరులు

బొబ్బిలి: ప్రజలందరిలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన శ్రీరామాలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలు చేపట్టడంతోనే భగవంతుని ఆశీస్సులు మనపై ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి శంబంగి శ్రీకాంత్ స్థానిక నాయకులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బెల్లపు ఊట ధ్వంసం

బొబ్బిలి: సర్కిల్ పరిధిలోని రాభద్రపురం మండలం కారిందొరవలస గ్రామంలో 2200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నిర్వహించిన దాడుల్లో బెల్లం ఊటతో పాటుగా పది లీటర్ల సారాయిని సీజ్ చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, సిబ్బంది బి.ఆదినారాయణ, ఇంటెలిజెన్స్ టీం కానిస్టేబుల్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ప్రజలకు చేరువగా ప్రభుత్వ వైద్యం
- నగరంలో నూతనంగా 7 అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు
- మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో 11 వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు
- రూ.500 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో...

మొత్తం అర్బన్ హెల్త్ సెంటర్‌ల సంఖ్య:	12
2019 సంవత్సరానికి ముందు ఉన్నవి :	5
వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మంజూరైనవి :	7
ఒక్కో భవన నిర్మాణానికి ఖర్చు చేస్తోన్న మొత్తం :	రూ.1.02 కోట్లు
7 భవనాల నిర్మాణానికి మంజూరైన మొత్తం:	సుమారు రూ.7.15 కోట్లు
ఇప్పటి వరకు ప్రారంభమైన అర్బన్ హెల్త్ సెంటర్‌లు :	5
ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి :	2



జిల్లా ప్రజల ఆరోగ్య ప్రధాయిని ప్రభుత్వ మెడికల్ కళాశాల

మండల పరిధిలో ఇలా....

మొత్తం గ్రామాల పంచాయతీలు :	22
మంజూరైన వెల్‌నెస్ సెంటర్‌లు :	11
ఒక్కో భవన నిర్మాణానికి కేటాయించిన మొత్తం :	రూ.21.05 లక్షలు
మొత్తం భవనాల నిర్మాణానికి కేటాయించిన నిధులు :	రూ.2.29 కోట్లు

విజయనగరం: ప్రజారోగ్యమే పరమావధిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో వైద్య సదుపాయాలు మెరుగుపర్చేందుకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. ఇందులో భాగంగా 2019 ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా చేసిన వాగ్దానం మేరకు విజయనగరం జిల్లా కేంద్రంలో రూ.500 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించి తరగతులు ప్రారంభించిన గొప్ప ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి జిల్లా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. అంతేకాకుండా క్షేత్ర స్థాయిలో కార్పొరేషన్ పరిధిలో కొత్తగా కార్పొరేట్ స్థాయిలో 7 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేయగా... గ్రామీణ ప్రాంతాల్లో 11 వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా రోగులకు సేవలందించేందుకు అవసరమైన వైద్యులతో పాటు వైద్య సదుపాయాలను కల్పించారు. నగర పరిధిలో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో 10 మంది ఇన్‌పేషెంట్‌లు చికిత్స పొందేలా చర్యలు తీసుకున్నారు. రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయటంతో పాటు వారికి అవసరమైన మందులు అందుబాటులోకి తీసుకురావటం విశేషం.



గాజులరేగలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



నారాయణపురం గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

దీంతో ప్రజలు చెంతకే ప్రభుత్వ వైద్య సేవలు అందటం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యతిరేకమవుతున్నాయి.

అందుబాటులో వైద్య సేవలు

నగరానికి శివారుల్లో ఉండే గాజులరేగ ప్రాంతం మాది. ఇక్కడి ప్రజలకు చిన్నపాటి అనారోగ్యం వచ్చినా విజయనగరం నగరంలోని వెళ్లాల్సిందే. దీంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించటంతో ఈ ప్రాంతంలో 18వేల మంది ప్రజలకు వైద్య సదుపాయం దగ్గరైంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత వైద్య రంగం రూపురేఖలు మారిపోయాయి.

– ఎల్. సత్యవతి, గాజులరేగ, 49వ డివిజన్, విజయనగరం

అభివృద్ధి జరిగిందని భావిస్తేనే ఓటేయండి



48వ డివిజన్ గాజులరేగ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 48వ డివిజన్ గాజులరేగలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం

విజయనగరం: విజయనగరం ఊరు అభివృద్ధి చెందితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పునరుద్ఘాటించారు. నగరంలోని 48వ డివిజన్ గాజులరేగ ముత్యాలమ్మ ఆలయం నుండి శుక్రవారం సాగిన ఇంటింటికి ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న కోలగట్లకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రచారానికి వచ్చిన తమ అభిమాన నాయకునికి మంగళహారతులు పట్టి, నుదుట తిలకాలు దిద్ది పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గాజులరేగలో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. కొత్తగా ఇంటింటికి కుళాయి వేయటంతో పాటు రోడ్లు, కాలువలు నిర్మించామని చెప్పారు. వాడుక నీరుకు ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లో బోరుబావులు ఏర్పాటు చేశామన్నారు. 18వేల జనాభా కలిగిన గాజులరేగలో 10 పడకల సామర్థ్యంతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించి వైద్య సేవలందించటం జరిగిందన్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేశామని, పథకాల కోసం లంచం ఇస్తే తమకు ఓటు వేయొద్దని చెప్పారు.

టీడీపీ నాయకుల దుష్ప్రచారం

గడిచిన 5 ఏళ్ల పాటు ప్రజల కష్ట సుఖాలను పట్టించుకోని ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎన్నికలు వస్తుండటంతో ప్రజలను ప్రలోభపెట్టేందుకు దుష్ప్రచారాలు చేస్తూ తిరుగుతున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఎద్దేవా చేశారు. విజయనగరాన్ని గంజాయి నగరంగా మార్చేశామని తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షం నాయకుల తీరును చూసి సిగ్గుపడుతున్నట్లు చెప్పారు. చేసేది లేక, చెప్పేది తెలియక అధికార పక్షంపై లేనిపోని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేశామని, జేఎన్‌టీయూ కాలేజీని యూనివర్సిటీగా తీర్చిదిద్దామని, గవర్నమెంట్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు నేడు కార్యక్రమాల ద్వారా సర్కారు పాఠశాలల రూపురేఖలను మార్చగలిగామని తెలిపారు. ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులు అయ్యారని, ఇకపై చంద్రబాబు ఆటలు సాగవని అన్నారు. మేయర్ వి.వి జయలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, జమ్మాన శ్రీనివాసరావు, కనుగుల రాజా జమ్ము మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి



పులిగెడ్డపేటలో ప్రచార ర్యాలీలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, రఘుబాబు తదితరులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స
- అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం

పూసపాటిరేగ : నెల్లిమర్ల నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎన్నడు జరగని విధంగా అభివృద్ధి చేసి చూపించామని, మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మరింత అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని పులిగెడ్డపేట, కొల్లాయివలస, మర్రిపేట గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని శుక్రవారం చేశారు. మహిళలు, వృద్ధులు, యువత బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికి వెళ్లి వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. బ్రోకర్ల ప్రమేయం లేకుండా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసారని, అవ్వాతాతలకు వలంటీరులు ద్వారా ఐదేళ్ల పాటు నిరాటంకంగా పింఛన్లు ఇంటి వద్దే ఇచ్చారు అన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి హృదయాలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారు అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, పైడి సుజాత, తాటిశెట్టి బాబు, పైడి మధు, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్న రెడ్డి, రౌతు శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజయంలో యువజన విభాగందే కీలకపాత్ర



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం కీలకపాత్ర పోషించాలని జిల్లా యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్‌కౌశిక్, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో రీమాపేట గ్రామ పంచాయతీలో వైఎస్సార్ యువజన విభాగం కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతిపక్ష పార్టీలు, వారికి వంతపాడుతున్న ఎల్లో మీడియా దుర్మార్గపు అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, యుజవన విభాగం నాయకులు, రీమాపేట సర్పంచ్ మహేష్, కోరాడ రవికుమార్, పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి పీహెచ్‌సీలో అత్యాధునిక పరికరాలు

రేగిడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యాధునిక పరికరాలను ఏర్పాటుచేశారు. రక్త పరీక్షలు నిర్వహించేందుకు రూ.4 లక్షల విలువైన హిమటాలజీ ఎన్‌లైజర్, బయోకెమిస్ట్ తదితర పరికరాలను ఏర్పాటు చేశారు. 63 రకాల రక్త పరీక్షలను ఒకే దఫా చేసుకునేందుకు వీలుంటుందని వైద్యాధికారి డాక్టర్ అసిరినాయుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రక్తపరీక్షలకు డబ్బులు వృధా చేసుకోకుండా ఇక్కడ రేగిడి పీహెచ్‌సీకి వచ్చి రక్తపరీక్షలు చేయించుకోవచ్చునని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రేగిడి : రైతులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టెక్నికల్ పోగ్రాం కోఆర్డినేటర్ కిరణ్ కోరారు. మండలంలో లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతీ రోజు చెరువులు, కాలువల్లోనే ఉపాధి హామీ పనులు చేయకుండా, రైతులకు సంబంధించిన పండ్ల తోటల్లో కూడా ఉపాధి పనులు చేసుకోవచ్చునని వెల్లడించారు. కందకాలు ఏర్పాటుచేసి వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఫారంఫాండ్లు కూడా ఉపాధి హామీతోనే చేసుకోవచ్చునని వివరించారు. రాష్ట్ర టెక్నికల్ రిసోర్సుపర్సన్ సుధీర్, ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఓ హరనాధరావు, టెక్నికల్ అసిస్టెంట్ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ



రామతీర్థంలో సహస్ర దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మండపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చల్లని వేళల్లో పనులు చేయండి

రాజాం సిటీ: ఉపాధిహామీ వేతనదారులు రెండు పూటలా చల్లని వేళల్లో పనులు చేయాలని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండల పరిధి శ్యాంపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులకు హాజరు కావాలని సూచించారు. రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతలు ప్రకారం పనులు చేయాలని అన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట టీఏ సాయిరాం తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధిలో జగ్జీవన్‌రామ్ కృషి మరువలేనిది



డెంకాడ: చింతలవలస ఏపీఎస్‌పీ ఐదో బెటాలియన్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అడిషినల్ కమాండెంట్ సామ్యూల్ తదితరులు

దేశాభివృద్ధిలో బాబూ జగ్జీవన్‌రామ్ కృషి మరువలేమని పలువురు పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



విజయనగరం: బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, తదితరులు



విజయనగరం ఫోర్ట్: ఆర్అండ్‌బీ జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఇజ్రాయిల్

రాజన్నకు మద్దతుగా ప్రచారం



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మెంటాడ: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు మద్దతుగా అందరూ నిలబడి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు అన్నారు. శుక్రవారం లోతుగెడ్డ సచివాలయం పరిధి గిరిజన గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న చేస్తున్న అభివృద్ధి సంక్షేమం గురించి వివరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు. తోటవలస, కొండపర్తి, సారవానివలస, బాసలపాడు, ఎర్రవానివలస, ఉయ్యాడవలస, గైరమ్మపేట ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, సర్పంచ్ భీమారావు, వైస్ సర్పంచ్ పైడపునాయుడులు, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుత్, రత్నాకర్ నాయుడు, రాజప్పల నాయుడు, బా యి అప్పారావు, మండలంలోని వివిధ గ్రామా ల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.